
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



తిరుపతి

జిల్లా వార్తలు

గురువారం 29 మే 2025

తెలుగుజాతికి ఆదర్శం ఎన్టీఆర్






కళాకారుల నృత్య ప్రదర్శన - ఎన్టీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతికి ఆదర్శప్రాయుడు దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఎన్టీఆర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిందన్నారు. ఎన్టీఆర్ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా రూ.2కే కిలో బియ్యం, గురుకుల సంక్షేమ వసతి గృహాలు, ఉచిత విద్య, స్కాలర్‌షిప్ వంటి పథకాలు.. తెలుగుగంగ ప్రాజెక్టు, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారన్నారు. వీటితో ఆయన చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఈ సందర్భంగా కళాకారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రోజ్‌మండ్, దేవేందర్‌రెడ్డి, డీపీవో సుశీలాదేవి, జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, జిల్లా కోఆపరేటివ్ పీడీ లక్ష్మి, డీఈవో కుమార్, ఆర్డీవోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బర్డ్ డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్ బాధ్యతల స్వీకరణ



తిరుపతి, మే 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్) డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు సూచనలతో ఈనెల 2న బర్డ్ డైరెక్టర్‌గా జగదీష్‌ను నియమిస్తూ టీటీడీ ఈవో శ్యామలరావు ప్రొసీడింగ్స్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బర్డ్ ఆస్పత్రి పాత భవనంలో ఇదివరకు ఆయన ఉన్న డైరెక్టర్ ఛాంబర్‌లోనే బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వైద్యులు, వైద్యసిబ్బందితో మాట్లాడారు. ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. ఈసందర్భంగా డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, ఎస్వీఎం శ్రీధర్, ఇతర నేతలు, అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మళ్లీ మళ్లీ అవే మెయిల్స్

ఏడు నెలలుగా తిరుపతికి బాంబు బెదిరింపులు ● తాజాగా కలెక్టరేట్‌కు, వ్యవసాయ కళాశాలకు

మీ హోటళ్లలో బాంబులు పెట్టాం.. పేల్చేస్తాం.

గతేడాది అక్టోబరు 24న ఉదయం 11.56 గంటలకు మొదలైన ఈ తరహా బెదిరింపు ఈ-మెయిల్స్ ఇప్పటికీ వస్తూనే ఉన్నాయి. తాజాగా తిరుపతి కలెక్టరేట్‌కు రెండోసారి.. వ్యవసాయ కళాశాలకు మూడోసారి బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఎప్పటిలాగే.. ఇవీ ఉత్తుత్తివేనని నిర్ధారణ అయ్యాయి.

తిరుపతి(నేరవిభాగం), మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిని లక్ష్యంగా చేసుకుని ఏడు నెలలుగా... తరచూ బాంబు బెదిరింపు మెయిల్స్ వస్తూనే ఉన్నాయి. తొలిసారిగా నాలుగు హోటళ్లకు మెయిల్స్ రావడంతో ఆందోళన మొదలైంది. తమిళనాడులో జాఫర్ షాదిక్‌కు జైలు శిక్ష విధించిన క్రమంలో బాంబులు పెట్టినట్లు ఐఎస్ఐ ఉగ్రవాదుల పేరిట మెయిల్స్ రావడంతో పోలీసులు, బాంబు, డాగ్ స్క్వాడ్ల సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఎక్కడా బాంబులు లేవని నిర్ధారించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అదే రోజున తిరుపతి మీదుగా నడిచే స్టార్ ఎయిర్ లైన్స్ విమానాన్ని బాంబుతో పేల్చివేస్తామంటూ ట్విట్టర్ ద్వారా అగంతకుడొకరు బెదిరించారు. మూడు రోజుల వ్యవధిలోనే అక్టోబరు 27న ఇస్కాన్ టెంపుల్‌ను పేల్చేస్తామంటూ ఆలయంలో అతిథి గృహాలు బుక్‌చేసే ఐడీకి మెయిల్ వచ్చింది. అదే రోజున మరో ఆలయంతో పాటు ఐదు హోటళ్లకూ ఇదే తరహా మెయిల్స్ రావడంతో పోలీసులు గంటలపాటు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. ఆ తర్వాత కొన్ని మెయిల్స్ వచ్చాయి. డిసెంబరు 13న వ్యవసాయ కళాశాలకు బెదిరింపు మెయిల్ వచ్చింది. కలెక్టరేట్‌లో బాంబు పెట్టినట్లు హార్దిక్ పీటర్స్ అనే వ్యక్తి మెయిల్ ఐడీ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్ అధికార మెయిల్ ఐడీకి మార్చి 21న మెయిల్ వచ్చింది. ఇలా దుండగుల నుంచి మెయిల్స్ రావడం.. పోలీసులు, బాంబు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు చేపట్టడం.. బాంబులు, పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించడం పరిపాటిగా మారింది. ఇక్కడితో ఆగిందనుకున్న ఈ బెదిరింపుల మెయిల్స్ బుధవారం మళ్లీ కలెక్టరేట్‌కు.. మూడోసారి వ్యవసాయ కళాశాలకు వచ్చాయి. దీంతో కొంత కలకలం రేపింది. ఇలా తిరుపతికి వరుస పెట్టి బాంబు బెదిరింపు మెయిల్స్ పంపుతున్నది ఎవరు? ఎక్కడ నుంచి పంపుతున్నారు? అనేది పోలీసులు గుర్తించలేకపోయారు. దీంతో అదే తరహా మెయిల్స్ వస్తున్నాయి.

రెండోసారి కలెక్టరేట్‌కు..!

● తమిళనాడు నుంచి బాంబు బెదిరింపు మెయిల్



కలెక్టరేట్‌లో పార్కింగ్‌లో ఉన్న వాహనాలను తనిఖీ చేస్తు బాంబ్ స్క్వాడ్

తిరుపతి(కలెక్టరేట్), మే 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌కు రెండోసారి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. జైస్మాల్ ముస్తాక్ సవుక్కు శంకర్ మద్రాస్ టైగర్స్ పేరిట జేసీ శుభం బన్సల్‌కు మంగళవారం సాయంత్రం అధికారికంగా మెయిల్ చేశారు. పాక్ జిందాబాద్.. జిల్లా కలెక్టరేట్‌లో ఆర్‌డీఎక్స్ అమర్చామని అందులో పేర్కొన్నారు. అందులో సోమవారం మధ్యాహ్నం 1.13 గంటలకు బాంబులు పేలేలా అమర్చామని ఉండటం గమనార్హం. వెంటనే అధికారులు ఈ మెయిల్‌ను ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు ఫార్వార్డ్ చేసి సమాచారం ఇచ్చారు. సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించిన పోలీసు అధికారులు ఎలాంటి అనుమానాస్పద అంశాలూ లేవని నిర్ధారించుకున్నారు. బుధవారం ఉదయం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. పార్కింగ్‌లోని వాహనాలను తనిఖీ చేశారు. అన్ని విభాగాల్లోనూ తనిఖీచేసిన బాంబు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది చివరికి అంతా ఉత్తిదేనని తేల్చడంతో కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. గతంలోనూ మార్చి 21న ఇదే తరహాలో బాంబు బెదిరింపు మెయిల్ వచ్చిన విషయం తెలిసిందే.

మూడోసారి వ్యవసాయ కళాశాలకు..



కళాశాలలో బాంబు డిస్పోజల్ స్క్వాడ్ తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం),మే28 (ఆంధ్రజ్యోతి):తిరుపతిలోని వ్యవసాయ కళాశాలకు మూడోసారి బాంబు బెదిరింపుమెయిల్ వచ్చింది. శివదాస్ మీనా అనే పేరుతో ఉదయం 9గంటలకు ఈమెయిల్ అందింది.అందులో అఫ్జల్ గురూను ఉరితీసినందుకు, తమిళనాడులో సవుక్కు శంకర్ పట్ల డీఎంకే వ్యవహరించిన తీరుకు 2నిరసనగా కాలేజీలో పైప్ బాంబులు అమర్చినట్టు పేర్కొన్నారు. ఇవి ఏ క్షణమైనా పేలే అవకాశాలున్నాయని ఆ మెయిల్‌లో హెచ్చరించారు. ఈ మెయిల్ విషయమై రూరల్ సీఐ చిన్నగోవిందుకు అధికారులు సమాచారం ఇచ్చారు. పోలీసులు, డాగ్, బాంబు స్క్వాడ్ సిబ్బంది కళాశాలకు చేరుకుని ప్రిన్సిపల్, డీన్, రిజిస్ట్రార్ చాంబర్లతో పాటు తరగతి గదులు, హాస్టళ్లు, ల్యాబ్‌లు, కళాశాల చుట్టు పక్కల ప్రాంతాల్లో బాంబు డిస్పోజల్ పరికరాలతో తనిఖీ చేశారు. ఎలాంటి బాంబులు లేవని అంతా ఫేక్ మెయిల్స్ అని తేల్చారు. ఈ వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు మెయిల్ రావడం ఇది మూడోసారి.

ఎలిఫెంట్ టాస్క్‌ఫోర్స్‌పై గజరాజుల దాడి

● ఇద్దరికి గాయాలు



బోయపల్లె సమీపంలోని బత్తలగుట్ట వద్ద గజసంచారం



గాయపడ్డ మునస్వామి, లక్ష్మీప్రసాద్

ఎర్రావారిపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి): భాకరాపేట కేంద్రంగా పనిచేసే ఎలిఫెంట్ టాస్క్‌ఫోర్సు అధికారులపై గజరాజులు దాడి చేయడంతో ఇద్దరు గాయపడ్డారు. ఎర్రావారి పాలెం మండలం ఎల్లమంద పంచాయతీ బోయపల్లె సమీపంలోని బత్తలగుట్ట వద్ద ఏనుగుల గుంపు కదలికలున్నాయనే సమాచారం వీరికి అందింది. అదే సమయంలో డ్రోన్ల ద్వారా గజరాజుల కదలికలను గుర్తించిన టాస్క్‌ఫోర్స్‌లోని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మునస్వామి, ఎల్లమంద ఎఫ్‌బీవో ప్రసాద్, లక్ష్మీ ప్రసాద్, సిబ్బంది బుధవారం సాయంత్రం బత్తలగుట్టకు వెళ్లారు. గజరాజులను అడవిలోకి మళ్లించేందుకు ప్రయత్నిస్తుండగా జంట ఏనుగుల్లో ఒకటి అధికారులపైకి దూసుకొచ్చింది. ఈ హఠాత్పరిణామంతో వారు చెల్లాచెదురై పరుగెత్తి ప్రాణాలు దక్కించుకొనే క్రమంలో ఎఫ్ఎస్‌వో మున స్వామి, గార్డు లక్ష్మీ ప్రసాద్ గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం వాహనంలో తిరుపతికి తరలించారు. గాయపడిన అధికారులకు మెరుగైన చికిత్స అందించేందుకు రేంజర్ వెంకట్రమణ సకాలంలో చర్యలు చేపట్టారు. మండలంలోని కోటకాడపల్లె, ఎల్లమంద, ఉస్తికాయల పెంట పంచాయతీల్లో రైతులు పొలాలకు రాత్రి పూట వెళ్ళరాదని సూచించారు.

తెలుగుగంగ ఎస్ఈగా విజయ్‌కుమార్‌రెడ్డి

తిరుపతి, మే 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్ఈగా పి.విజయ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. జలవనరుల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేస్తున్న ఆయనకు ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికన ఎస్ఈగా పదోన్నతి కల్పించింది. ఆ పదోన్నతిపై ఆయనను తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు, గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుల సర్కిల్‌కు బదిలీ చేసింది.

'మహానాడు' సభకు భారీగా జనం

● జిల్లా నుంచి 20 వేల మంది హాజరవుతారని అంచనా





టీడీపీ అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన చంద్రబాబుకు శుభాకాంక్షలు చెబుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

తిరుపతి, మే 28 (ఆంధ్రజ్యోతి): కడపలో గురువారం జరిగే తెలుగుదేశం పార్టీ మహానాడు బహిరంగసభకు జిల్లా నుంచీ భారీగా జనం తరలుతున్నారు. మహానాడు తొలి, మలి రోజు కార్యక్రమాలకు ఐదు వేల మందికిపైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. గురువారం సాయంత్రం ముగింపు సందర్భంగా జరిగే భారీ బహిరంగసభలో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో శ్రేణులు ఉదయం కడపకు బయలుదేరనున్నారు. జిల్లాలోని ఆర్టీసీ డిపోల నుంచీ 335 బస్సులు కేటాయించారు. ఇందులో అన్నమయ్య జిల్లా కోడూరు నియోజకవర్గానికి 60, రాజంపేటకు 75 చొప్పున పంపించారు. మిగిలిన 200 బస్సులను జిల్లాలో నియోజకవర్గాల వారీగా పంపించారు. బుధవారం రాత్రి 10 గంటలకు ఆయా నియోజకవర్గాలలోని మండల కేంద్రాలకు చేరేలా బస్సులను పంపించారు. ఆర్టీసీకి సంబంధించి ఇంత భారీ సంఖ్యలో బస్సులను నాయకులు బుక్ చేయడం ఇదే తొలిసారని అధికారవర్గాలు చెబుతున్నాయి.

- తొలిరోజే చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ వెంట అన్ని మండలాల నుంచీ నాయకులు, కార్యకర్తలు మహానాడుకు భారీగా తరలి వెళ్లారు. బహిరంగసభకు గురువారం ఉదయం మరో రెండు వేల మంది బయల్దేరి వెళ్ళనున్నారు. చంద్రగిరి నుంచి ఐదు బస్సులు, తిరుపతి రూరల్ నుంచీ మూడు బస్సులు, వంద కార్లు, జీపులు, పాకాల నుంచీ 5 బస్సులు, ఆర్సీపురం నుంచీ రెండు బస్సులు, చిన్నగొట్టిగల్లు నుంచీ రెండు బస్సులు, 30 కార్లు, జీపులు, ఎర్రావారిపాలెం నుంచీ మూడు బస్సులు, పది చిన్న వాహనాల్లో బయల్దేరుతున్నారు.
- శ్రీకాళహస్తి నుంచీ ఇప్పటికే సుమారు 500 మంది వెళ్లగా బహిరంగ సభకు 70 బస్సులు, ఇతర వాహనాల్లో 5 వేల మంది వెళ్లేలా ఏర్పాట్లు చేసుకున్నారు.
- గూడూరు నుంచీ ఇప్పటికే 27 బస్సులు, ఇతర వాహనాల్లో వెయ్యి మంది వెళ్లారు. బహిరంగసభకు 60 బస్సులు, 40 టెంపోలు, ఇతర వాహనాల్లో నాలుగు వేల మంది బయల్దేరడానికి సన్నాహాలు చేసుకున్నారు.
- సూళ్లూరుపేట నుంచీ గురువారం ఉదయం 25 బస్సులు, వంద కార్లు, జీపుల్లో 5 వేల మంది బయల్దేరడానికి సిద్ధమవుతున్నారు.
- వెంకటగిరి నుంచీ 110 బస్సులు, 200 కార్లలో 5 వేల మంది బయల్దేరుతున్నారు.
- నగరి నుంచీ ఇప్పటికే వెయ్యి మంది వరకూ కార్యకర్తలు మహానాడులో ఉండగా, బహిరంగసభకు గురువారం ఉదయం 80 ఆర్టీసీ, ప్రైవేటు బస్సులతో పాటు ఇతర వాహనాల్లో 5 వేల మంది వెళ్లనున్నారు.
- తిరుపతి నుంచీ 30 బస్సులు, వందకు పైగా కార్లు, జీపుల్లో 5 వేల మంది బహిరంగసభకు ప్రయాణవుతున్నారు.
- సత్యవేడు నియోజకవర్గం నుంచీ ఇప్పటికే 500 మందిదాకా మహానాడులో వుండగా గురువారం ఉదయం 20 బస్సులు, ఇతర వాహనాల్లో 1500 మంది బయల్దేరనున్నారు.




మహానాడు ఆవరణలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, మహానాడు వేదికపై చిత్తూరు, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గాల టీడీపీ అధ్యక్షులు సీఆర్ రాజన్, నరసింహయాదవ్‌లతో భీమనేని చిట్టిబాబు

మహానాడుకు తరలిన రూరల్ నేతలు



ఎమ్మెల్యే నానిని కలిసిన రూరల్ మండల టీడీపీ నేతలు మునిశేఖర్, గోపాల్

తిరుపతిరూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహిస్తున్న టీడీపీ మహానాడుకు తిరుపతి రూరల్ మండలం నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన తనయుడు వినీల్ మహానాడులో కీలక బాధ్యతలు నిర్వహిస్తుండడంతో వారికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తున్నారు. దుర్గసముద్రం గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిశేఖర్ నేతృత్వంలో నాయకులు రవి, సుధాకర్, సుబ్బురాయల్, శంకర్, విజయ్‌కుమార్, అవిలాలకు చెందిన కవితాగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు



చంద్రగిరి, మే 28(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవర్లు భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య సేవల్లో భాగంగా ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవర్లకు ఊంజల్ సేవ కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్ఠించారు. ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదార్ చిరంజీవి పాల్గొన్నారు.

మాతమ్మకు సారె సమర్పణ



సారె తీసుకొస్తున్న టీడీపీ నాయకులు

చంద్రగిరి, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలపురం గ్రామంలో నిర్వహిస్తున్న మాతమ్మ తిరునాళ్లలో భాగంగా బుధవారం మండపంపల్లెకు చెందిన టీడీపీ నాయకులు పేస్ రాయల్ ఆధ్వర్యంలో అమ్మవారికి సారె సమర్పించారు. చంద్రగిరి జాతీయ రహదారిలోని ఫ్లై ఓవర్ నుంచి డప్పులు వాయిస్తూ రాయలపురంలోని మాతమ్మ ఆలయానికి చేరుకుని, అమ్మవారికి సారెను సమర్పించి, ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవీంద్రయాదవ్, యువరాజు యాదవ్, రాయలపురం గ్రామస్తులు రామ్మూర్తి, నాగార్జున పాల్గొన్నారు.


వార్షిక క్రెడిట్, జీవనోపాధి ప్రణాళికపై అవగాహన



మాట్లాడుతున్న పీడీ శోభన్‌బాబు

తిరుపతిరూరల్, మే28(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు వార్షిక క్రెడిట్, జీవనోపాధి ప్రణాళిక తయారీలపై అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. తిరుపతి రూరల్ మండలంలోని వెలుగు మహిళా సమాఖ్య భవన్‌లో బుధవారం మహిళా సమాఖ్య కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఎంపీడీవో కె.రామచంద్ర మాట్లాడుతూ మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని, పండ్ల, పూల తోటల పెంపకాన్ని చేపట్టి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు, ఏపీవో జ్యోతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణతో బహుళ ప్రయోజనాలు



గ్రూప్ కమాండర్ సతీందర్ దహియాకు వందన సమర్పణ చేస్తున్న క్యాడెట్లు

రామచంద్రాపురం, మే 28 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు ఎన్‌సీసీ శిక్షణ పొందడం వల్ల విద్య, ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్ తో పాటు బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియ అన్నారు. మండలంలోని సి.రామాపురం గ్రామంలోని వెరిటాస్ సైనిక్ స్కూల్ ఆవరణలో బుధవారం వార్షిక శిక్షణ శిబిరాలను నిర్వహించారు. గ్రూప్ కమాండ్ కల్నల్ సతీందర్ దహియ, ట్రైనింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ సందీప్ శంకర్ పరిశీలించారు. సతీందర్ దహియా మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణలో సి సర్టిఫికెట్ పొందితే దేశ రక్షణ విభాగాలైన ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీలో ఉద్యోగాలు సులభంగా పొందవచ్చన్నారు. సందీప్ శంకర్ మాట్లాడుతూ శిక్షణ ద్వారా క్యాడెట్లు ఐక్యత, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. క్యాంపు కమాండర్ కెప్టెన్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంపు కమాండ్ శ్రీనివాసులు, క్యాంపు పర్యవేక్షకులు గుణశేఖర్, సీనియర్ ఏఎన్‌వోలు ఉదయ్, రాజశేఖర్, ఎన్‌సీసీ క్యాడెట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రగిరి

ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేకాలంకరణలో ముత్యాలమ్మ

తిరుపతిరూరల్, మే28 (ఆంధ్రజ్యోతి): చిగురువాడ గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి మహాభిషేక, హోమ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రవి, వరలక్ష్మి దంపతుల నేతృత్వంలో అన్నదానం చేశారు.

స్టాఫ్ క్వార్టర్స్‌ను ఉద్యోగులకు ఉచితంగా కేటాయించండి

తిరుపతి రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): వీసీ బంగ్లాకు సమీపంలో ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉచితంగా క్వార్టర్స్, కరెంట్‌ను అందిస్తున్నారని, అదే తరహాలో తమకు కూడా కేటాయించాలని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ బోధనేతర ఉద్యోగుల సెంట్రల్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు సంఘ ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రవికుమార్‌ని కలిసి వినతిపత్రం అందించినట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.నాగరాజు, కె.బాల కార్తీక్ తెలిపారు. సంఘ ఆఫీసు కోసం భవనాన్ని కేటాయించాలని విన్నవించగా పాడుబడిన, ఉపయోగంలో లేనిదాన్ని ఇచ్చారని, దాన్ని మార్పు చేయమని ఇప్పటికే పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. వర్సిటీ ఉన్నతాధికారులు ఆ దిశగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

వ్యాను, స్కూటీ ఢీ : ఒకరి మృతి



మృతిచెందిన సాదిక్ బాషా

పాకాల, మే 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు - కర్నూలు జాతీయ రహదారి పాకాల మండలం దామలచెరువు సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. కల్లూరుకు చెందిన బుల్‌డోజర్ డ్రైవర్ సాదిక్ బాషా (40) స్కూటీపై కల్లూరు నుంచి దామలచెరువు వైపు వస్తుండగా కల్లూరు వైపు వెళ్తున్న వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో సాదిక్ బాషా అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పాకాల ఎస్సై సంజీవరాయుడు సంఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి



మృతిచెందిన కాంతమ్మ

పాకాల, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగరాల పంచాయతీ గెనుమగట్టుపల్లెలో బుధవారం మధ్యాహ్నం విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతిచెందింది. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో గ్రామంలో రెండు ఇండ్లకు షార్ట్ సర్క్యూట్ అయింది. ఓ ఇంట్లో ల్యాప్‌టాప్ కాలిపోయింది. మరో ఇంట్లో గ్రిల్ గేట్‌కు విద్యుత్ సరఫరా కావడంతో గేటు ముట్టుకున్న డి.కాంతమ్మ (74) మృతిచెందింది. సమాచారం అందుకున్న సీఐ సుదర్శన ప్రసాద్ సంఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

104 వాహనం ఢీకొని వృద్ధురాలికి గాయాలు

పాకాల, మే 28 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి పాకాల మండలం గాదంకి టోల్‌ప్లాజా సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలికి గాయాలయ్యాయి. ఇరుగు రంగయ్యగారిపల్లెకు చెందిన మరియమ్మ (70)ను టోల్ ప్లాజా సమీపంలో 104 వాహనం ఢీకొంది. ఆమె కుడికాలికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

దివ్యాంగులను భవిత కేంద్రాల్లో చేర్పించండి



దివ్యాంగుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న చంద్రశేఖరరెడ్డి

భాకరాపేట, మే28(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను భవిత కేంద్రాలలో చేర్పించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని సహిత విద్యా జిల్లా కో-ఆర్డినేటర్ చంద్రశేఖరరెడ్డి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం దీన్‌దార్లపల్లె, భాకరాపేట వడ్డిపల్లె, దిగువ హరిజనవాడ గ్రామాలలో ఆయన బుధవారం పర్యటించారు. దివ్యాంగులకు భవిత కేంద్రాలలో ఫిజియోథెరపీతో పాటు స్పీచ్ థెరపీ, ఉచితంగా ఉపకరణాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 గోపీనాథ్, సహిత విద్య ఉపాధ్యాయులు వెంకటరమణ, వెంకటయ్య పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రత పెరుగుతుంది



చిన్నగొట్టిగల్లు నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులు

భాకరాపేట, మే 28(ఆంధ్రజ్యోతి): యోగా చేయడం వల్ల మనిషికి ఏకాగ్రత పెరుగుతుందని ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. భాకరాపేట ఉన్నత పాఠశాలలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలు, యోగా చేసే విధానాలను యోగా మాస్టర్లు వివరించారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, మే 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు మండలంలో ఆ పార్టీ నాయకులు ఘన నివాళి అర్పించారు. రావిళ్లవారిపల్లె గ్రామంలో టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డితో కలిసి ఆ పార్టీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు వెంకటరమణ, ఆర్‌ఐ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జనార్దన్ చౌదరి, నరసింహారెడ్డి, గిరిబాబు, చిట్టిబాబు, కోరా హరిప్రసాద్, సురేందర్‌నాయుడు, జయపాల్, రమేష్‌బాబు, రామ్మోహన్‌నాయుడు, హరినాథ్ పాల్గొన్నారు.

22న బీసీ సంక్షేమ సంఘం ఆత్మగౌరవ సభ

తిరుపతి (ఆటోనగర్), మే 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం, అంబేడ్కర్ పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూన్ 22వ తేదీన తిరుపతి ఇందిరా మైదానంలో బీసీ సంక్షేమ సంఘం ఆత్మగౌరవ భరోసా సభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగరాజు తెలిపారు. ఈ మేరకు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సభకు సంబంధించి ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. బీసీలను చైతన్యపరచడానికి నిర్వహిస్తున్న ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మధు ఆచారి, సోమశేఖర్ ఆచారి, నాగేంద్ర, జగదీష్ పాల్గొన్నారు.





చంద్రగిరిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, నారావారిపల్లెలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు, జూపార్క్ ఎదురుగా ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు

ఘనంగా ఎన్టీఆర్ జయంతి




హెరిటేజ్ వద్ద పండ్లు పంపిణీ చేస్తున్న రైతు నాయకుడు దామోదర నాయుడు, పెరుమాళ్లపల్లెలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఈశ్వర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, కత్తి సుధాకర్ తదితరులు

చంద్రగిరి, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద టీడీపీ పట్టణాధ్యక్షుడు సక్కూరి ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించి, కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఎన్టీఆర్ అంటే స్ఫూర్తి, ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి సింగు సుధా, టీడీపీ సీనియర్ నాయకులు రమేష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, నాయకులు బాలకృష్ణమూర్తి, కొందూరు ప్రవీణ్ రాయల్, తులసేశ్వరరెడ్డి, లోకాద్రినాయుడు, హరి, చినరాయుడు, డిష్ గోపి, శంకర్, గురుమూర్తిరెడ్డి పాల్గొన్నారు. నారావారిపల్లెలో గ్రామస్తులు ఎన్టీఆర్ బసవతారకం విగ్రహాలకు పూలమాల వేసి, నివాళులర్పించి స్వీట్లు పంచిపెట్టారు. నారా కేశవులునాయుడు, నారా విజయ్ పాల్గొన్నారు. కాశిపెంట్ల హెరిటేజ్ ఫ్యాక్టరీ ముందు టీడీపీ రైతు నాయకుడు కొమ్మినేని దామోదర్‌నాయుడు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. తను పండించిన మామిడి, బొప్పాయి, జామ పండ్లను కార్మికులకు, ఆ దారిలో వెళ్లే ప్రజలకు పంచిపెట్టారు.

తిరుపతి రూరల్‌లో..

తిరుపతిరూరల్: తిరుపతి రూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పెరుమాళ్లపల్లెలో టీడీపీ మండలాధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు కత్తి సుధాకర్, ఎంపీటీసీ సోమశేఖర్‌రెడ్డి, గ్రామకమిటీ అధ్యక్షుడు సాకేత్, రాష్ట్ర నాయకులు చెంగయ్య, రఘునాథరెడ్డి, కిశోర్, చంద్రమౌళిరెడ్డి, మధు, నాగూరు శ్రీనివాసులు, బ్రహ్మం చౌదరి, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

● వెంకటపతినగర్‌లో: వెంకటపతినగర్ పంచాయతీలోని జూపార్క్ ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి గ్రామకమిటీ అధ్యక్షుడు ఉసిరిపాటి శ్రీనివాసులు నేతృత్వంలో పాలాభిషేకం చేశారు. పుష్పాలతో నివాళి అర్పించారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి, కె.సుధాకర్, పాతకాలువ గ్రామ అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి, బాలు యాదవ్ పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లులో..



చిన్నగొట్టిగల్లు తహసీల్దారు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో, కుమ్మరపల్లె వద్ద ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గిడ్డయ్య, డీటీ వాసుదేవకుమార్, టీడీపీ నాయకులు మోహన్ రెడ్డి, బెల్లంకొండ రమణ నాయుడు, సురేంద్ర నాయుడు, రాజగోపాల్ నాయుడు, నాగరాజ, హైదర్‌వలీ, రాజేంద్ర, కృష్ణమూర్తి, మల్లికార్జున, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పాకాలలో..



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అరిస్తున్న టీడీపీ శ్రేణులు

పాకాల: పాకాల, దామలచెరువులో ఎన్టీఆర్ విగ్రహాలకు పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజనాయుడు పాల్గొన్నారు.

కబ్జా భూమికి విముక్తి

● నాటిన మామిడి మొక్కలను తొలగించిన రెవెన్యూ అధికారులు



మామిడి మొక్కలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

ఎర్రావారిపాలెం, మే 28(ఆంధ్రజ్యోతి): తలకోన రోడ్డుకు అతి సమీపంలో కబ్జాకు గురైన 3 ఎకరాల ప్రభుత్వ భూమికి రెవెన్యూ అధికారులు విముక్తి కల్పించారు. తహసీల్దార్ పరమేశ్వరస్వామి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని నెరబైలు రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు 1480లో ప్రభుత్వ గయ్యాలు భూమి ఉంది. గతంలో రెవెన్యూ అధికారులు రైతులకు పట్టాలు ఇచ్చారు. మిగిలిన గుట్టగా ఉన్న 300 ఎకరాల భూమి గ్రామంలోని రైతులు పశువులు, జీవాలు మేపుకొనేందుకు, గ్రామ అవసరాల కోసం ఉంచారు. దీనిపై గ్రామంలోని ఓ బడా రైతు కన్ను పడింది. ఎక్సకవేటర్లతో కొంతకాలంగా చదును చేస్తు వస్తున్నాడు. గతంలో గ్రామస్తుల ఫిర్యాదుతో ఆ భూమిలో ఎవరూ ప్రవేశించరాదని రెవెన్యూ అధికారులు బోర్డు పెట్టారు. పట్టించుకోని సదరు వ్యక్తి రెండు రోజుల క్రితం ఆ భూమిలో మామిడి మొక్కలు నాటాడు. విషయం తెలియడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వోలు మస్తాన్, రెవెన్యూ సిబ్బంది బుధవారం మొక్కలను తొలగించారు. ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడటంతో అధికారులను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

మామిడిలో పండు ఈగ

యాజమాన్యంపై అవగాహన



మామిడి తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి శైలజ

చంద్రగిరి, మే 28(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం భీమవరం గ్రామంలో మామిడిలో పండు ఈగ యాజన్యంపై రైతులకు ఉద్యానవన అధికారులు అవగాహన కల్పించారు. 'ప్రస్తుతం చాలా తోటల్లో మామిడి పక్వదశకు చేరువలో ఉంది. మే నెలలో కురిసిన వర్షాలతో పంట అనుకున్న సమయం కంటే 15 రోజుల ముందుగానే కోతకు వచ్చింది. ప్రస్తుతం తోతాపురి రకం 7 నుంచి 10 రోజులలో కోతలకు సిద్ధంగా ఉంది. నీలం రకం జూన్ నెల చివరిలోపు పంట చేతికి వచ్చే అవకాశం ఉంది. వర్షాల కారణంగా తోటలలో కలుపు ఎక్కువగా పెరగడం, తేనె మంచు పురుగు, కాయ, ఆకులు తినే గొంగళి పురుగు, పండు ఈగ ఉధృతి అధికమవుతోంది. కాయ కోతకు రాకుండా 10 నుంచి 20 రోజుల వరకు చెట్టు పైన నిలుపుకోవాలంటే రైతులు కొన్ని యాజమాన్య పద్ధతులు పాటించాలి. మొదటగా పండు ఈగ నివారణకు ఎకరాకు 8 నుంచి 10 ఎర బుట్టలను ఐదు అడుగుల ఎత్తులో కట్టాలి. రాలిన కాయలను సేకరించి ఒక అడుగు లోతు గొయ్యిలో మట్టిలో పూడ్చిపెట్టాలి. అందువల్ల 90 శాతం వరకు పండు ఈగ నివారణ అదుపు చేయవచ్చు' అని మండలం ఉద్యానవన అధికారి శైలజ వివరించారు.

● తేనె మంచు పురుగు ఉనికిని గమనించిన రైతులు ఆసిఫేట్-1.5 గ్రాములు, అజాక్సీస్ట్రోబిన్-1 మిల్లీ, లేదా థయోఫినేట్ మిథైల్-1 గ్రాము, బంక-0.5 మిల్లీ, ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే కాయ నాణ్యత దెబ్బతినకుండా చూడొచ్చన్నారు. లేత ఆకులను, కాయలను తినే గొంగళి పురుగులను గమనించినప్పుడు ఎమామెక్టిన్ బెంజోయేట్ పురుగు మందును 0.5 గ్రాములు, ఒక లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు.

మెరుగ్గా పారిశుధ్య పనులు

- మున్సిపల్ సమీక్షలో అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ సంపత్ కుమార్

తిరుపతి, మే28(ఆంధ్రజ్యోతి) : నగరంలో మరింత మెరుగ్గా పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి సంస్థ కమిషనర్ అండ్ డైరెక్టర్ సంపత్ కుమార్ అన్నారు. బుధవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎన్.మౌర్య అధ్యక్షతన రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్‌తో కలసి వివిధ విభాగాల అధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మరింత మెరుగ్గా ఫలితాలు వచ్చేలా పనిచేయాలన్నారు. నగరంలో వందశాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దోమలు పెరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని సూచించారు. విద్యుత్ చార్జీలు, వాహనాల మరమ్మతులు, డీజిల్ వినియోగం తగ్గేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంస్థకు ఆదాయం వచ్చే మార్గాలను అన్వేషించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డీసీపీ మహాపాత్ర, మేనేజర్ హసీమ్ తదితరులు ఉన్నారు.

● **అన్న క్యాంటీన్ పరిశీలన**

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని స్విమ్స్ కూడలి వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌ను పరిశీలించారు. అన్నా క్యాంటీన్లలో నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.

మొక్కల సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలి



దివ్యారామంలో మొక్కలు నాటుతున్న వివేక్

మంగళం, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రకృతి ప్రేమికులు మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ పిలుపునిచ్చారు. బుధవారం కపిలతీర్థం సమీపంలోని దివ్యారామంలో దేశీయ మొక్కలను నాటి వృక్షాలుగా అభివృద్ధి చేయాలన్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీనియర్ జర్నలిస్టు, ప్రకృతి ప్రేమికుడు పల్లవల్లి రామచంద్రారెడ్డి తన 65వ పుట్టిన రోజు సందర్భంగా కదంబం మొక్కను తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ చేతులమీదుగా నాటారు. ఆయన మాట్లాడుతూ కపిలతీర్థం, శ్రీకాళహస్తి, చింతపల్లి ప్రాంతాల్లోని నర్సరీల్లో 2.5లక్షల దేశీయ మొక్కలను పెంచి పంపిణీ చేస్తామన్నారు.

తుడా అకౌంట్స్‌ను డిజిటలైజ్ చేయండి

- కాగ్ బృందం సూచన



తిరుపతి, మే 28(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)ను బుధవారం భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) బృందం సందర్శించింది. కాగ్ బృంద సభ్యులు రీషా ప్రకాష్, రష్మీ అగర్వాల్, ఎన్వీ నిఖిల, ఆర్ శ్యామ్‌లు తుడా అధికారులతో సమావేశమయ్యారు. తుడా చేపడుతున్న పనులను వీసీ మౌర్య వివరించారు. తుడా పాటిస్తున్న అకౌంటింగ్ విధానాలను డిజిటలైజేషన్ చేయడానికి చర్యలు తీసుకోవాలని కాగ్ బృందం సూచించింది. ఈ సమావేశంలో తుడా కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్ బాబు, ఎస్ఈ కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రభుత్వ విప్



తిరుమల, మే28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేసి, ప్రసాదాలు అందజేశారు.

మత సామరస్యాన్ని కాపాడుకుందాం


ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

తిరుపతి(ఆటోనగర్), మే 28(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని అణచివేయాలని, మతసామరస్యాన్ని కాపాడాలని కోరుతూ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు 100 మీటర్ల జాతీయ పతాకంతో పుర వీధుల్లో బుధవారం ర్యాలీ నిర్వహించారు. పాత మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు కాళ్ల మండపం, గాంధీ రోడ్డు, తీర్థకట్ట వీధి, వీవీమహల్ రోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. నాయకులు వి.నాగరాజు, జె.విశ్వనాథం, పి.అంజయ్య, రఫీ హిందుస్తానీ మాట్లాడుతూ ఉగ్రదాడిని ఖండించడంలో ప్రజలు కనబరిచిన ఐక్యత అభినందనీయమన్నారు. కాల్పుల విరమణ సమయంలో దేశ ప్రతిష్టకు భంగం కలిగేవిధంగా మోదీ ప్రభుత్వం అనుసరించిన తీరును తప్పు పట్టారు. ఈ ర్యాలీలో నాయకులు టీ సుబ్రమణ్యం, జయచంద్ర, వేణుగోపాల్, సాయిలక్ష్మి, మాధవకృష్ణ, బుజ్జి, హేమలత, నరేంద్ర, బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కూల్చడం అన్యాయం


కూల్చిన ఇళ్లను పరిశీలిస్తున్న అఖిలపక్ష నాయకులు

తిరుపతి అర్బన్/కలెక్టరేట్, మే 28(ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్లు కూల్చడం అన్యాయమని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. మంగళంలోని తిరుమలనగర్ గ్రామపంచాయతీ వేణుగోపాల్‌కాలనీలో సోమవారం అర్ధరాత్రి కూల్చిన ఇళ్లను బుధవారం ఉదయం పరిశీలించారు. బాధితులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు అంజయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.సుబ్రహ్మణ్యం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రహ్మణ్యం, న్యాయవాది వెంకటయ్య, జయచంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, వేణుగోపాల్, మునిరాజ, బుజ్జి, మాధవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులను పూర్తి చేయండి



తిరుపతి, మే 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై నిలిచిపోతున్నాయని, సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారంలో భాగంగా బుధవారం ఉదయం ఎస్టీవీ నగర్, వెంకటరెడ్డి కాలనీ, గాంధీపురం, కెనడి నగర్, పాత తిరుచానూరు రోడ్డులో కార్పొరేటర్ ఎస్కే బాబు, వివిధ శాఖల అధికారులతో కలసి పరిశీలన చేశారు. ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి వర్షపునీరు నిలవకుండా చర్యలు చేపట్టాలన్నారు. మరమ్మతుకు గురైన డ్రైనేజీలను సరిచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. వెంకటేశ్వర థియేటర్ వద్ద రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్ ఆమె వెంట ఉన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

● జయంతి వేడుకల్లో పార్టీ శ్రేణుల ఆకాంక్ష





ఎన్టీఆర్ చిత్ర పటానికి కమిషనర్‌తో కలిసి నివాళులర్పిస్తున్న నేతలు, ఎస్పీ హర్షవర్ధన రాజు, ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న శ్రీధర్‌వర్మ

తిరుపతి, మే5(ఆంధ్రజ్యోతి) : సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు నినాదంతో అశేష ప్రజానీకం హృదయాలను గెలుచుకున్న ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని టీడీపీ శ్రేణులు అభిలషించాయి. ఎన్టీఆర్ జయంతి వేడుకలు టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం టౌన్‌క్లబ్ సర్కిల్లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఘనంగా జరిగాయి. ముందుగా టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఏపీజీబీసీ ఛైర్మన్, నియోకవర్గ ఇన్‌చార్జి మన్నూరు సుగుణమ్మ, కలెక్టర్ వెంకటేశ్వర్, నగర కమిషనర్ మౌర్య, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, యూఎఫ్‌డీసీ డైరెక్టర్ ఊకా విజయకుమార్ తదితరులు ఎన్టీఆర్‌కు ఘన నివాళులర్పించారు.

● **పార్లమెంటు కార్యాలయంలో...**

తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నాయకులు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలు, ధైర్యం, ప్రజాసేవలను స్మరించుకున్నారు. ముఖ్యంగా తిరుపతిలో ఎన్టీఆర్ చేసిన అభివృద్ధి పనులను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యశ్వంత్ రెడ్డి, రవిశంకర్ యాదవ్, రాజయ్య, రామా యాదవ్, మునిరామయ్య, రమణ, నాని, పురుషోత్తం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో

తిరుపతి, మే 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్రపటానికి కమిషనర్ ఎన్.మౌర్య, ఏపీజీబీసీ ఛైర్మన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, విజయకుమార్, కార్పొరేటర్ నారాయణలు పుష్పాంజలి ఘటించారు. నగరపాలక సంస్థ డీసీ అమరయ్య, ఎస్ఈ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, మేనేజర్ హసీమ్ పాల్గొన్నారు.

ఎస్పీ క్యాంపు కార్యాలయంలో..

తిరుపతి(నేరవిభాగం): ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఎస్పీ హర్షవర్ధనరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ తెలుగు ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. రిజర్వు అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

తిమ్మినాయుడుపాళెం వద్ద..

తిరుపతి(జీవకోన) : తిమ్మినాయుడుపాళెం వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నేతలు నివాళులర్పించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టౌన్‌బ్యాంకు మాజీ ఛైర్మన్ పులుగోరు మురళీకృష్ణారెడ్డి, స్టేట్ అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ ఊకా విజయకుమార్, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్‌యాదవ్, ఊట్ల సురేంద్రనాయుడు, స్థానిక నేతలు నరేష్‌రెడ్డి, రవిరెడ్డి, దండు విజయ్, దోని, సుబ్బుయాదవ్, ధనంజయ్ పాల్గొన్నారు.

సదరన్ డిస్కం కార్యాలయంలో..

తిరుపతి(ఆటోనగర్), మే 28(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి సీఎండీ కె.సంతోషరావు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ సమయపాలనలో ఉద్యోగులు ఎన్టీఆర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డైరెక్టర్లు వై.లక్ష్మీనరసయ్య, పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య, సీజీఎంలు రమణాదేవి, కె.ఆదిశేషయ్య, జీఎంలు ప్రసాద్, వెంకటరాజు, రామచంద్రరావు, శ్రీకాంత్, సురేంద్రరావు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో..

తిరుపతి(వైద్యం), మే 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. స్విమ్స్‌లో డైరెక్టర్ ఆర్వీకుమార్ సిబ్బందితో కలిసి అత్యవసర విభాగం ముందు సర్కిల్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. రోగులకు అన్నదానం చేశారు. ఎస్వీ వైద్య కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకట్ ఆధ్వర్యంలో, రుయా, ప్రసూతి ఆస్పత్రుల్లో సూపరింటెండెంట్లు రాధ, పార్థసారథిరెడ్డి, ఈఎస్ఐలో మెడికల్ సూపరింటెండెంట్ శ్యాంబాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

ఎన్టీఆర్ తెలుగు వారి ఆత్మగౌరవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) : ఎన్టీఆర్ తెలుగు వారి ఆత్మ గౌరవ ప్రతీక అని ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పేర్కొన్నారు. ఎన్టీఆర్ జయంతి సభలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ ప్రొఫెసర్ చెంగ్రాయుడు, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీ ప్రిన్సిపాల్ నరసయ్య, డిప్యూటీ ఇంజినీర్ శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, టీడీపీ నేతలు పులుగోరు మురళి, మహేష్‌యాదవ్

మహిళా పక్షపాతి ఎన్టీఆర్

ఎన్టీఆర్ మహిళా పక్షపాతి అని పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ అన్నారు. ఎన్టీఆర్ జయంతి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్టీఆర్ మహిళలను ఉన్నత విద్యావంతులను చేయాలనే లక్ష్యం ఉన్నతమైందని అభిప్రాయపడ్డారు. మహిళా సాధికారతకు గట్టి పునాది వేశారని చెప్పారు. రిజిస్ట్రార్ రజని, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

యుగ పురుషుడు ఎన్టీఆర్

సినిమా, రాజకీయాల్లో ఎన్టీఆర్ యుగ పురుషుడిగా నిలిచారని బీజేపీ నాయకుడు గుండాల గోపీనాథరెడ్డి పేర్కొన్నారు. టౌన్ క్లబ్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పుష్పాంజలి ఘటించి మాట్లాడారు.




ఎన్టీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సంతోషరావు, తిరుపతి పార్లమెంటు కార్యాలయంలో నేతల నివాళి, స్విమ్స్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

ఎస్వీయూ పరీక్షల డీన్‌గా సురేంద్రబాబు


నియామకపత్రం అందుకుంటున్న సురేంద్రబాబు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 28 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరీక్షల డీన్‌గా ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు నియమితులయ్యారు. ఇప్పటివరకూ పరీక్షల డీన్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ కిషోర్ స్థానంలో ఆయన్ను నియమించారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు నుంచి బుధవారం ఆయన నియామక ఉత్తర్వులు స్వీకరించారు. చంద్రగిరి మండలం పాండురంగవారిపల్లెకు చెందిన సురేంద్రబాబు ప్రస్తుతం లైబ్రరీ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా ఉన్నారు. యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయం డైరెక్టర్‌గా, ఏపీపీజీసెట్-2025 కో-కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. లైబ్రరీ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో 25 ఏళ్లుగా అధ్యాపకత్వం వహించారు. 52 పరిశోధనా వ్యాసాలు, 2 పుస్తకాలు రాశారు. గురువారం బాధ్యతలు స్వీకరించనున్న సురేంద్రబాబును పలువురు అభినందించారు.

పేదలకు అల్పాహారం వితరణ


రుయాస్పత్రి సమీపంలో పేదలకు అల్పాహారం అందజేస్తున్న మలబార్ సిబ్బంది

తిరుపతి అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆకలి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వ్యాపార సంస్థ బుధవారం ఉదయం దాదాపు 500మందికి అల్పాహారం వితరణ చేసింది. ఆహారం పొట్లాలను నింపుకున్న వాహనాన్ని టౌన్‌క్లబ్ వద్ద డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, షోరూం హెడ్ రిజీష్ జెండా ఊపి ప్రారంభించారు. రుయాస్పత్రి, రైల్వేస్టేషన్, గోవిందరాజస్వామి కోనేరు, బస్టాండు తదితర ప్రాంతాల్లో పేదలకు అందజేశారు. ఇకపై ప్రతిరోజూ ఉదయం 500మందికి అల్పాహారం అందించేలా చర్యలు చేపట్టామని రిజీష్ తెలిపారు.

నేడు సీపీఎల్ ఫైనల్స్


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న చారుకేష్

తిరుపతి(క్రీడలు), మే 28(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రీమియర్ లీగ్ సీజన్ 1లో పాయ్‌వైస్రాయ్-హైపీరియన్ జట్ల మధ్య తుది పోరు గురువారం మధ్యాహ్నం జరగనుంది. బుధవారం మధ్యాహ్నం హోరాహోరీగా సాగిన పోరులో ఆదిత్య లెవెన్స్‌పై హైపీరియన్ జట్టు విజయం సాధించింది. తొలుతగా బ్యాటింగ్ చేసిన ఆదిత్య జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 166/8 స్కోరు సాధించింది. హైపీరియన్ జట్టు 19.3 ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి లక్ష్యం ఛేదించింది. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన చారుకేష్(54పరుగులు) మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు ఎంపికై సీడీసీఏ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఈసీ మెంబరు హరిప్రసాద్‌ల చేతుల మీదుగా అందుకున్నాడు.

పారదర్శక ఓటర్ల జాబితాకు సహకరించాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 28 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాను పారదర్శకంగా తయారు చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం అవసరమని డీఆర్వో నరసింహులు అన్నారు. ఇదే అంశంపై కలెక్టరేట్‌లో బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఓటర్ల జాబితా తయారీలో వారి సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, డీటీ ఉషారాణి పాల్గొన్నారు.

గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

తిరుమల, మే28(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడిని ఆహ్వానించారు. ఈ మేరకు తిరుమలలోని క్యాంపు కార్యాలయంలో ఆలయాధికారులు, అర్చకులు బుధవారం ఆయన్ను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని, భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఛైర్మన్ వారికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శాంతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), మే 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ సెక్షన్‌లో విద్యుత్ తీగల మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ డివిజన్ ఈఈ చంద్రశేఖరరావు తెలిపారు. రెడ్డిఅండ్ రెడ్డి కాలనీ, టీకే స్ట్రీట్, దొడ్డాపురం వీధి, కేకే లేఅవుట్ సమీప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.



హుండీ లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు


ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.72 కోట్లు

శ్రీకాళహస్తి, మే 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,72,70,504 వచ్చింది. బుధవారం ఆలయంలో హుండీ లెక్కింపు జరిగింది. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 73.200 గ్రాములు, వెండి 607.100 కిలోలు, విదేశీ కరెన్సీ 92 వచ్చింది. ఈ లెక్కింపులో ఆలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జ్యూస్ పరిశ్రమ యజమానులకు బ్యాంకు సహకారం అందించాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 28(ఆంధ్రజ్యోతి): మామిడి జ్యూస్ పరిశ్రమ యజమానులకు బ్యాంకు అధికారులు అన్ని విధాలుగా సహకారం అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం బ్యాంకు అధికారులతో వర్చువల్ విధానంలో ఆయన సమీక్షించారు. మామిడిజ్యూస్ పరిశ్రమ యజమానులకు బ్యాంకువారు మంజూరు చేసిన రుణాలను రీషెడ్యూల్ చేసి వారికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజరు రవికుమార్, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని 31 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.52 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,597

తలనీలాలు సమర్పించినవారు: 30,803

ఐదు పర్యాటక కేంద్రాల్లో యోగా ప్రచారం

● నేడు ఎస్వీ జూపార్కులో ప్రారంభం

తిరుపతి, మే 28 (ఆంధ్రజ్యోతి): జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజల్లో యోగాపట్ల అవగాహన పెంచేందుకు ముమ్మరంగా ప్రచారం చేపడుతున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. పది లక్షల మందికి అవగాహన కల్పించాలని లక్ష్యం పెట్టుకున్నామన్నారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. పర్యాటక శాఖ ద్వారా జిల్లాలో ఐదు పర్యాటక కేంద్రాల్లో యోగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. అందులో భాగంగా గురువారం ఉదయం తిరుపతి ఎస్వీ జూపార్కులో మొదటి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జూన్ 4న చంద్రగిరి కోటలో, 11న శ్రీహరికోట అంతరిక్ష కేంద్రంలో, 17న శ్రీకాళహస్తిలో, 19న తిరుమల ఆస్థాన మండపంలో ఈ తరహా ప్రచార కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అటు పర్యాటకాన్ని, ఇటు యోగాను ప్రచారం చేసేలా ఈ కార్యక్రమాలు రూపొందించామని వివరించారు. ఇప్పటికే ఇంటింటి సర్వేతో ఆసక్తి ఉన్నవారి పేర్లు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా ఢిల్లీలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా ఆధ్వర్యంలో వివిధ శాఖలతో పాటు టీటీడీ, ఈశా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలను భాగస్వామ్యం చేస్తున్నట్లు వివరించారు.

15న తిరుమలలో స్టేట్ ఈవెంట్

తిరుమలలో జూన్ 15వ తేదీన స్టేట్ లెవల్ ఈవెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. ప్రతి జిల్లాలో రాష్ట్ర స్థాయి ఈవెంట్‌ను.. ఒక్కో ప్రత్యేక వర్గంతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా జిల్లాలో క్రీడా, సినిమా, సంగీత, సేవా రంగాలలోని ప్రముఖులతో తిరుమలలో సెలెబ్రిటీ యోగా డే నిర్వహిస్తామన్నారు. ప్రముఖులతో పాటు కనీసం ఐదు వేల మంది భక్తులు పాల్గొనేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కన్నెర్రజేసిన కడలి

విద్యార్థినిని మింగేసిన అలలు - శ్రీనివాససత్రంలో బాలిక మృతి



పల్లవి (ఫైల్‌ఫొటో)

కోట, మే 28 (ఆంధ్రజ్యోతి): కడలి కన్నెర్రజేసింది.. సరదాగా గడిపేందుకు తల్లితో కలిసి సముద్ర తీరానికి వెళ్లిన బాలికను అలల రాకాసి మింగేసింది. కోట మండలం కొత్తపట్నం పంచాయతీ శ్రీనివాససత్రం గ్రామానికి చెందిన లక్ష్మయ్య, సౌమ్య దంపతుల కుమార్తె పల్లవి(12) ఎర్రావారిపాళెం మండలం ఉదయమాణిక్యంలోకి జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. వేసవి సెలవులకు ఇంటికి వచ్చిన బాలిక బుధవారం గ్రామంలోని మరో ముగ్గురు స్నేహితులతో పాటు తల్లితో కలిసి గ్రామానికి సమీపంలో ఉన్న బీచ్‌లో సరదాగా గడిపేందుకు వెళ్లింది. సుమారు రెండు గంటలపాటు తీరంలో ఉల్లాసంగా గడిపారు. ఒక్కసారిగా భారీ అలలు వచ్చి ఒడ్డున ఉన్న పల్లవి సముద్రంలోకి లాక్కెళ్లాయి. అక్కడే ఉన్న తల్లి తన బిడ్డ సముద్రపు నీళ్లలో కొట్టుకుపోతుండడంతో హతాశులయ్యారు. వెంటనే గ్రామస్తులకు చెప్పడంతో స్థానికంగా ఉన్న గజఈత గాళ్లు పడవలు, బోట్లతో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. గంటన్నర తరువాత ఒడ్డుకు చేరిన పల్లవిని గుర్తించి ఆఘమేఘాలపై చిల్లకూరు మండలంలోని చింతవరం ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి గూడూరు ప్రభుత్వాస్పత్రి తరలిస్తుండగా మృతి చెందింది. గ్రామంలో ఆడుతూ పాడుతూ అందరినీ అలరించే పల్లవి మృతితో శ్రీనివాససత్రంలో విషాద చాయలు అలుముకున్నాయి.







నడక మార్గానికి సమీపంలో ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్స్ - కెమెరా ట్రాప్స్ పనితీరును పరిశీలిస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

భక్తుల సంరక్షణే లక్ష్యంగా పనిచేయండి

● నడకమార్గాల్లో నిరంతర నిఘా ఉండాలి

● అటవీశాఖ అధికారులకు అదనపు ఈవో ఆదేశం



ఎస్ఎస్ టెంపుల్ వద్ద ఫారెస్ట్‌లో అధికారులతో మాట్లాడుతున్న అదనపు ఈవో

తిరుమల, మే28(ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే భక్తుల సంరక్షణే లక్ష్యంగా ఫారెస్ట్, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది పనిచేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశించారు. వన్యమృగాల బారినపడి ఏ భక్తుడికి హాని జరగడానికి వీల్లేదన్నారు. నడక మార్గాలతో పాటు ఘాట్‌రోడ్లలో నిరంతర నిఘా ఉంచాలన్నారు. వరుస చిరుతల సంచారం నేపథ్యంలో బుధవారం ఆయన అలిపిరి నడకమార్గంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం(ఎస్ఎస్ టెంపుల్) వద్ద తనిఖీలు నిర్వహించారు. చిరుతల సంచారం అధికంగా ఉండే ఏడోమైలు నుంచి ఎస్ఎస్ టెంపుల్ వరకు నడకమార్గానికి ఇరువైపులా ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్స్‌ను పరిశీలించారు. వాటి పనితీరు గురించి ప్రభుత్వ అటవీశాఖ అధికారులు ఆయనకు వివరించారు. స్టాటిక్ కెమెరాలు, మోషన్ సెన్సార్ కెమెరాలు ఎలా ఉపయోగపడుతున్నాయనేది తెలియజేశారు. ఈనెల 21వ తేదీన ఎస్ఎస్ టెంపుల్ వద్ద కెమెరాకు చిక్కిన ఓ చిరుత దృశ్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ.. సోలార్ కెమెరాలకు బూస్టర్లను ఫిక్స్ చేయడం ద్వారా అవి నిరంతరాయంగా పనిచేస్తాయని సూచించారు. కెమెరాల ముందు కనిపించే వన్యమృగాల సమాచారాన్ని టీటీడీ ఫారెస్ట్, విజిలెన్స్ విభాగాలకూ తెలియజేసి సమన్వయంగా భక్తులను అప్రమత్తం చేయాలని ప్రభుత్వ ఫారెస్ట్ అధికారులను కోరారు. అవసరమైతే మరికొన్ని కెమెరా ట్రాప్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. దీనికి టీటీడీ సహకారం ఉంటుందన్నారు. నడక మార్గాల్లో భద్రతా సిబ్బందిని పెంచాలన్నారు.

చిరుతను ఢీ కొన్న వాహనం

● తీవ్ర గాయాలతో పాడుపడిన కోనేరులో మృతి

● ఆలస్యంగా వెలుగులోకి..



పాడుబడిన కోనేరు వద్ద చిరుత కళేబరం

చంద్రగిరి, మే 28(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన చిరుత.. చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలోని మామిడి తోటలో పాడుపడిన కోనేరులో మృతి చెందింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. హరిప్రసాద్‌రెడ్డి మామిడితోటలోని కోనేరులో చిరుత కళేబరాన్ని బుధవారం గొర్రెల కాపరి గుర్తించారు. ఈ సమాచారం మేరకు నాగపట్ల అటవీ సిబ్బంది కోనేరును పరిశీలించి, ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. సాయంత్రం 5 గంటల సమయంలో తిరుపతి ఎస్వీ జూపార్క్ వైద్యులు తోయబ సింగ్, నారావారిపల్లె వెటర్నీ డాక్టర్ వంశీ సంఘటనా స్థలంలోనే చిరుతకు పోస్టుమార్టం చేశారు. ఇది చిరుత చిరుత అని, సుమారు ఏడాది వయసు ఉంటుందని, ఎడమ వైపు మెడ దగ్గర, ఎడమ కాలు దగ్గర కమిలిన గాయాలు ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చిరుత శరీర భాగాలు, కాళ్ళు, గోళ్ళు, దంతాలు, చర్మం, బాగానే ఉన్నాయన్నారు. వారం కిందట వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయని, మూడు రోజుల కిందట కోనేరు వద్దకు వచ్చి మృతి చెందిందనట్లుగా భావిస్తున్నారు.



వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ



వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు



వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం





పసుపు జాతర


రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.







మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు



మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి..







నోరూరించే వంటలు రెడీ...



మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ




అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు



మేము విజిలేస్తే...



కార్యకర్తల ఉత్సాహం..



రక్తదానం చేస్తున్న కార్యకర్తలు



పోలీసు తనిఖీలు

పట్టా ఒకరిది... వెబ్‌ల్యాండ్‌లో మరొకరికి

న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధితులు

9 నెలలుగా తిరుగుతున్నా పట్టించుకోని అధికారులు



తహసీల్దారు కార్యాలయం ఎదుట వెంకటయ్య దంపతుల నిరసన

వెంకటగిరి టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెట్లూరు గ్రామానికి చెందిన వెంకటయ్యకు సర్వే నెం. 122-4లో 0.53 సెంట్ల పట్టాభూమి ఉంది. దీనిపై ఖాతా నంబరు 120తో పట్టాదారు పాస్ పుస్తకం కూడా ఉంది. అయితే ఇందులో 36సెంట్లు త్రివిక్రమరావు పేరుమీద వెబ్ ల్యాండ్‌లో నమోదై ఉంది. దీన్ని గుర్తించిన బాధితులు తమకు న్యాయం చేయాలంటూ తొమ్మిది నెలలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కానీ అధికారులెవరూ పట్టించుకోవడం లేదంటూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్‌ను కోరగా... వెబ్‌ల్యాండ్‌లో 33సెంట్లు త్రివిక్రమ రావు పేరు మీద ఉందన్నారు. అతని వద్ద ఉన్న డాక్యుమెంట్లు తీసుకుని రావాలని వీఆర్‌వోను ఆదేశించామని చెప్పారు. రికార్డులు పరిశీలించి బాధితులకు తగు న్యాయం చేస్తామని తెలిపారు.

నిడిగుర్తి పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీలు



హెల్త్ రికార్డు నమోదును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

వాకాడు, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌వో బాలకృష్ణనాయక్ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలను అందించాలని వైద్యులకు సూచించారు. రికార్డులను ఆన్‌లైన్ చేయడంలో వెనుకబడి ఉండటంతో మెరుగుపరచాలని డాక్టర్ శశికుమార్‌కు సూచించారు. ఆస్పత్రిలో మరో డాక్టర్‌ను నియమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గూడూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో మస్తానమ్మ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సమైక్యతా యాత్రను విజయవంతం చేయండి

గూడూరు అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం జక్కా వెంకయ్య వర్ధంతి సందర్భంగా నిర్వహించనున్న సమైక్యతా యాత్రను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బీవీ రమణయ్య, శివకుమార్, శంకరయ్య, మధు, మణి, ప్రసాద్, రమేష్, నాగేంద్ర, సుధాకర్, చంద్రయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నియంత్రణపై అవగాహన



ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

గూడూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు కూడళ్లలలో బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఏఆర్‌టీ మెడికల్ అధికారి ఇస్మాయిల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీపై అవగాహన కలిగివుండేలా వీధి నాటక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కలుషితమైన సిరంజీలు, రక్తమార్పిడి ద్వారా హెచ్‌ఐవీ సంక్రమించేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, ప్రకాష్, జయచంద్ర, జయలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ తూకాల్లో తేడాలొస్తే చర్యలు



రేషన్ డీలర్లకు సూచనలిస్తున్న తహసీల్దారు రామయ్య

వాకాడు, మే 28 (ఆంధ్రజ్యోతి): చౌక దుకాణాల్లో పంపిణీ చేసే రేషన్ బియ్యం తూకాల్లో వ్యత్యాసం వస్తే చర్యలు తప్పవని తహసీల్దారు రామయ్య అన్నారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండీయూ వాహనాలను రద్దుచేసి పాత పద్ధతిలోనే రేషన్ సరుకుల పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రతి నెలా 1నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4నుంచి రాత్రి 8 గంటల వరకు డీలర్లు అందుబాటులో ఉండాలన్నారు. 65 సంవత్సరాలు పైబడిన, విభిన్న ప్రతిభావంతులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ అందజేయాలని సూచించారు. సమావేశంలో సివిల్ సప్లయ్స్ డీటీ మల్లికార్జున్‌రావు, పౌర సరఫరాల గోదాము ఇన్‌చార్జి వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ అఖిల్‌యాదవ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేటి నుంచి వికసిత కృషి సంకల్ప అభియాన్

వెంకటగిరి టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 29 నుంచి జూన్ 12వ తేదీ వరకు వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. 'ప్రయోగశాల నుంచి నేలకు' అనే నినాదంతో ఖరీఫ్‌లో రైతులు అధిక ఆదాయాన్ని పొందడానికి చర్యలు చేపట్టిందన్నారు.

మహానాడుకు తరలిన టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): మహానాడుకు హాజరుకావడానికి బుధవారం సూళ్లూరుపేట టీడీపీ నుంచి నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో దంతాల రవి, కుదిరి పెంచలయ్య, ఏడుకొండలు, మేడా సాయినారాయణ, ఆరణి చంద్రమోహన్ తదితరులు తరలివెళ్లారు.



మహానాడుకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

చిల్లకూరు, మే 28(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అదానీ ఫౌండేషన్ కృషి చేస్తుందని ఆ సంస్థ ప్రతినిధి రాజేస్‌రంజన్ అన్నారు. బుధవారం మండలంలోని గుమ్మళ్లదిబ్బ గ్రామంలో అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు వేరుశనగ రిటైల్ మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులను రిటైల్ మార్కెటింగ్ చేయడంపై మహిళలకు అవగాహన కల్పించి వారు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కోటేశ్వరమ్మ, జగదీష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు

కోట, మే 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని క్రాస్‌రోడ్డు, శ్యామసుందరపురం, ఆంజనేయస్వామి గుడివీధి, వెంకన్నపాళెం గ్రామాల్లోని చౌక దుకాణాలను డిప్యూటీ తహసీల్దార్ మల్లిఖార్జునరావు తనిఖీ చేశారు. జూన్ 1వ తేదీ నుంచి ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం, నిత్యావసర సరుకులు చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో చౌక దుకాణాలను డీటీ తనిఖీ చేశారు. ఆయన వెంట వీఆర్‌వో కన్నా వెంకటరమణయ్య ఉన్నారు.



చిల్లకూరులో పచ్చనిదుప్పటి పరిచినట్లు కనువిందు చేస్తున్న వరిపైరు

పుడమికి పచ్చకోక కట్టినట్లు..

పెళ్లకూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): రుతు పవనాలు ముందుగానే ప్రవేశించడంతో పది రోజులుగా కురుస్తున్న వర్షాలు వరిపైరుకు జీవం పోస్తున్నాయి. పెళ్లకూరు మండలంలోని స్వర్ణముఖినది పరివాహక ప్రాంతంతో పాటు తెలుగుగంగ కాలువల ద్వారా నీటిని విడుదల చేయడంతో పునబాక, చెంబేడు, అర్ధమాల, పెళ్లకూరు, చిల్లకూరు, పుల్లూరు, పనుపుకండ్రిగ, ముమ్మారెడ్డిగుంట, కలవకూరు, పెరుమాళ్లపల్లి, చావాలి, పెన్నేపల్లి, కప్పగుంటకండ్రిగ, జీలపాటూరు, కొత్తూరు, రావులపాడు, నెలబల్లి, బీమవరం తదితర గ్రామాల్లో ఎడగారు వరిసాగు చేపట్టారు. తాళ్వాయిపాడు నుంచి నెలబల్లి వరకు 71వ జాతీయ రహదారికి ఇరువైపులా పచ్చదనం సంతరించుకుని కనువిందు చేస్తోంది.





నాయుడుపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు - గూడూరు, కోటలో టీడీపీ నాయకుల నివాళి

బడుగు, బలహీన వర్గాల ఆరాధ్య దైవం ఎన్టీఆర్

నాయుడుపేట టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : సామాన్య ప్రజల్లో సైతం రాజకీయ చైతన్యాన్ని రగిలించి తెలుగువారి ఆత్మగౌరవాన్ని జాతీయ స్థాయిలో చాటిన మహనీయుడు, బడుగు బలహీన వర్గాల ఆరాధ్య దైవం ఎన్టీఆర్ అని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెసల కిషోర్‌బాబు, రఫీ, నెల వల రాజేష్, కట్టా రమణారెడ్డి, నానాబాల సుబ్బారావు, పసల గంగా ప్రసాద్, నారాయణ, రవి, అవధానం సుధీర్, నిత్యకృష్ణారెడ్డి, జీవీఆర్ నాయుడు, జువ్వలపాటి మస్తాన్, అన్నమనేని సాయి, సుబ్రహ్మణ్యం, భాస్కర్, చెంచయ్య, శేషం మునిగోపీ, లోకనాథం, గుంటూరు లక్ష్మయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక గమళ్లపాళెం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్‌రెడ్డి, జనార్దనరెడ్డి, పెంచలయ్య, నరసరాజు, తూపిలి సురేంద్ర, వేముల సునీల్, అరుణ్, పార్వతయ్య, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని వెంకన్నపాళెంలో టీడీపీ బూత్ కన్వీనర్ వీరయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు జరిగాయి. వెంకన్నపాళెం, వీరారెడ్డి సత్రం, తాటితోపు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉలస శీనయ్య, ముచ్చకాయల పవన్‌కుమార్, విన్నమాల శ్రీకాంత్, వంకా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డక్కిలి: మండల పరిషత్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి, ఎంఈవో జగదీష్‌బాబు, ఈవోపీఆర్డీ అల్లాభక్షు నివాళులర్పించారు.

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో చిట్టేటి పెరుమాల్, నాపా మునిరాజా, వాకచర్ల రమేష్, అలవల శ్రీనివాసులు, బండారు ఆంజనేయులు, మెస్ రమణయ్య, మార్కొండేయలు, గండవరం రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మురళీకృష్ణ ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

తడ: మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కామిరెడ్డి మురళీరెడ్డి, నీలకంఠం, నాయకులు శివాజీ, మనోహర్, జీవ, రమేష్, ఏడుమలై తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈవోపీఆర్‌డీ విజయకుమార్, పంచాయతీ కార్యదర్శులు గాబ్రియల్, మస్తాన్, సురేష్, శేఖర్‌రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాకాడు: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు నివాళులర్పించారు. డీటీ సందీప్, ఆర్‌ఐ అఖిల్, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరు: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు సతీష్ కుమార్, డీటీ నిరంజన్ కుమార్ ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు.






సూళ్లూరుపేటలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు వేనాటి సతీష్ రెడ్డి, పెరుమాల్, రమేష్, శ్రీనివాసులు తదితరులు - డక్కిలి మండల పరిషత్ కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న ఎంపీడీవో గుణశేఖరరెడ్డి, ఎంఈవో జగదీష్ బాబు - వాకాడు రెవెన్యూ కార్యాలయంలోతహసీల్దారు రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, చిట్టమూరు ఉంపీడీవో కార్యాలయంలో అధికారుల నివాళులు

రైతులకు న్యాయబద్ధంగా పరిహారం చెల్లిస్తాం: జేసీ



రైతులతో మాట్లాడుతున్న జేసీ శుభమ్ బన్సల్

పెళ్లకూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డు నిర్మాణానికి సేకరించిన భూములకు న్యాయబద్ధంగా పరిహారం చెల్లిస్తామని జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సల్ పేర్కొన్నారు. బుధవారం పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ రహదారికి భూములిచ్చిన తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, చిల్లకూరు రైతులతో జేసీ సమావేశమయ్యారు. నాయుడుపేట పట్టణానికి సమీపంలో ఉన్న తాళ్వాయిపాడు, పెన్నేపల్లి రెవెన్యూ పరిధిలోని భూములకు తగిన పరిహారం ఇప్పించాలని రైతులు కోరారు. జేసీ మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులందరికీ ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం న్యాయబద్ధమైన పరిహారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

బీజేపీతోనే హిందూ మతానికి ప్రమాదం: సీపీఐ

సూళ్లూరుపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే హిందూ మతానికి ప్రమాదం పొంచి ఉందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినాథరెడ్డి అన్నారు. బుధవారం సూళ్లూరుపేటలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాం ఘటనకు నిఘా వైఫల్యమే కారణమన్నారు. కశ్మీర్ సమస్యను బూచిగా చూపించి పాకిస్థాన్‌తో యుద్ధంగా చేయాలనే ఆలోచన మంచిది కాదన్నారు. దేశంలో మతం పేరుతో దళితులు, గిరిజనులపై దాడులు జరుగుతున్న పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 23 నుంచి 25 వరకు మూడు రోజుల పాటు ఒంగోలులో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నం పెంచలయ్య, నియోజకవర్గ కార్యదర్శి సుధాకర్ రెడ్డి, నాయకులు పార్థసారథి, నాగేంద్ర, ఆనంద్, శ్రీనివాసులు, చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరినాథరెడ్డి, పక్కన సుధాకరరెడ్డి, పెంచలయ్య తదితరులు

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో బుధవారం పొనకా మల్లికార్జున్‌రెడ్డి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్, మోహన్, శ్రీనివాసులు, కరిముల్లా, కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల మంజూరుపై పునఃపరిశీలన

డక్కిలి, మే 28 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం జగన్న కాలనీల్లో మంజూరు చేసిన ఇంటి పట్టాల పునఃపరిశీలన త్వరగా పూర్తి చేయాలని తహసీల్దారు శ్రీనివాసులు వీఆర్వోలను ఆదేశించారు. బుధవారం ఆయన వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. జగన్న కాలనీల్లో 447 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందులో కొంత మంది బినామీలు ఉన్నట్లు ఫిర్యాదులు అందడంతో రీ వెరిఫికేషన్ చేపట్టాలన్నారు.

1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరుకులు

గూడూరు అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరుకులను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తహసీల్దారు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో గూడూరు పట్టణ, మండల పరిధిలోని 63 రేషన్ దుకాణాలకు సంబంధించి ఎలక్ట్రానిక్ కాటాలను, ఈ - పాస్ మిషన్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: వచ్చే నెల నుంచి రేషన్ దుకాణాల ద్వారానే సరుకులు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ నరసింహారావు తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు.

కాలువలోకి ఒరిగిపోయిన లారీ

సూళ్లూరుపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని ఫ్లైఓవర్ నుంచి రాఘవయ్యపేటకు వెళ్లే రోడ్డులో ఓ లారీ సైడ్ కాలువలోకి ఒరిగిపోయింది. ఫ్లైఓవర్ బ్రిడ్జికి అనుకొని ఉన్న రోడ్డులో ఇటుకల లోడ్‌తో వెళ్తున్న లారీ సైడ్ కాలువలో ఒరిగిపోవడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం ఎక్స్‌కవేటర్ సాయంతో లారీని బయటకు తీశారు.

నేడు హజరత్ ఖాదర్‌షావలి గంధోత్సవం

నాయుడుపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్నదర్గా హజరత్ ఖాదర్‌షావలి (ఉరుసు) గంధోత్సవం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు.

అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ

గూడూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సరస్వతి శిశుమందిరంలో అదనపు గదుల నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జనార్దనరెడ్డి, మురళీరెడ్డి, మయూరి శ్యామ్ యాదవ్, యుగంధర్, రంగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న పాఠశాల కమిటీ సభ్యులు

ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలి



నిరసన తెలుపుతున్న మహిళలు

వెంకటగిరి టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని తిరుపతి రోడ్డులో వల్లివేడు క్రాస్ వద్ద మహిళలు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలంటూ బుధవారం నిరసన తెలిపారు. వల్లివేడు క్రాస్‌రోడ్డు వద్ద సుమారు 50 కుటుంబాలు ఉంటున్నాయని, తాము మనులాల పేటలో ఉన్న రేషన్ షాపు వద్ద సరుకులు తీసుకోవాలంటే ఐదు కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంటుందన్నారు. రేషన్ బియ్యం కోసం వెళ్లితే ఒక రోజు కూలి పని మానుకోవాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.






మహానాడులో ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌తో గూడూరు, కోట, వాకాడు మండలాల నేతలు - పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి పరిటాల సునీతకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

శ్రీకాళహస్తి
సత్యవేడు

పేదల ఆరాధ్య దైవం ఎన్టీఆర్






ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న బొజ్జల రిషితారెడ్డి, టీడీపీ నేతలు - భేరివారి మండపం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు - రేణిగుంటలో కేక్ కట్ చేస్తున్న నాయకులు - పాపానాయుడుపేటలో కేక్ కట్ చేస్తున్న నాగరాజునాయుడు తదితరులు

శ్రీకాళహస్తి, మే 28(ఆంధ్రజ్యోతి): పేదల ఆరాధ్య దైవం స్వర్గీయ ఎన్టీఆర్ అని, ఆయన తెలుగుజాతికి తీసుకువచ్చిన కీర్తి చిరస్మరణీయమని ఎమ్మెల్యే సుధీర్ సతీమణి రిషితారెడ్డి అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో, ఎన్టీఆర్ విగ్రహం వద్ద 102వ జయంతి వేడుకలను రిషితారెడ్డి ఆధ్వర్యంలో కోలాహ లంగా జరుపుకున్నారు. ముందుగా పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ పంచిపెట్టారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిషితారెడ్డి మాట్లాడుతూ... కూడు, గూడు, గుడ్డ అనే మూడు అవసరాలను తీర్చడమే తన జీవితాశయంగా ఎన్టీఆర్ భావించారన్నారు. మహిళా అభ్యున్నతికి ఆయన కృషి మరువలేనిదన్నారు. రూ.2కే కిలో బియ్యం అందించి పేదల ఆకలి తీర్చారన్నారు. ఆర్టీసీ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. మునిరాజానాయుడు, గుర్రప్పశెట్టి, షాకీరాలీ, సుబ్బయ్య, నెమళ్లూరు బుజ్జి బీమాల మునికృష్ణ, ఖాదర్ బాషా, అస్మత్, భాస్కర్‌గౌడ్, ఆర్ముగం, ఎంఎస్ రెడ్డి, తెలుగు మహిళలు సుమతి, మల్లీశ్వరి, రేణుకాదేవి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

● బడుగుల ఆత్మబంధువు ఎన్టీఆర్ అని టీడీపీ శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్ అన్నారు. బుధవారం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని భేరివారి మండపం వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, వన్నియకుల క్షత్రియ సంక్షేమ సంఘ రాష్ట్ర డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు సుబ్బయ్య, ప్రకాష్‌నాయుడు, పొన్నారావు, ఉమేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నా యుడు, తిరుపతి పార్లమెంట్ తెలుగురైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, నాయకులు సురేష్‌రెడ్డి, జనసేన నాయకుడు థామస్, స ర్పంచ్ బాలాజి, తహీల్దారు మునిరత్నంరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో ఎన్టీఆర్ జయంతిని టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ కూడలి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచ నలుమూలలా చాటి చెప్పిన ఘనత ఎన్టీఆర్‌దేనని కొనియాడారు.





కేవీబీపురం, వరదయ్యపాళెం, పిచ్చాటూరులోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్టీఆర్‌కు నివాళులు

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో బుధవారం మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తహసీల్దార్ సుధీర్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు మాత్రం రెండు గ్రూపులు జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారికంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించినట్లు ఎంపీడీవో మహ్మద్‌రఫి తెలిపారు. ఎంఈవో యుగంధర్‌రాజు, ఏపీవో నాగభూషణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షుడు నాగరాజునాయుడు ఆధ్వర్యంలో పాపానాయుడుపేటలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. రావిళ్లవారికండ్రిగలో అన్నదానం చేశారు. కృష్ణప్ప మొదలియార్, చలపతి నాయుడు, నిరంజన్ బాబునాయుడు, కేశినేని సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. అంజిమేడులో ఏపీసీడ్స్ మాజీ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. శివాజీరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జయంతి వేడుకలను తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ రాజశేఖర్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీటీ త్యాగరాజు, ఆర్‌ఐ సురేష్, వీఆర్వో వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయంలో కూటమి నాయకులు బండారు మోహన్‌బాబు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఎన్టీఆర్ నగర్‌లో జరిగిన వేడుకల్లో తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి పామాంజి వాసు, ఐ-టీడీపీ ఇన్‌చార్జి సంతోష్‌కుమార్, యుంగధర్, సుధాకర్, శరణ్య పాల్గొన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎన్టీఆర్ జయంతిని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు.

పారిపోయిన అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ అరెస్టు



స్మగ్లరు అరెస్టు చూపుతున్న సీఐ

శ్రీకాళహస్తి, మే 28(ఆంధ్రజ్యోతి): పోలీసుల దాడిలో పారిపోయిన అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. పట్టణ శివార్లలో ఎంజీఎం కూడలి వద్ద తమిళనాడుకు చెందిన ముగ్గురు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం విదితమే. వారినుంచి 13 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఈనెల 27న మంగళవారం రిమాండ్ తరలించారు. ఈ ఘటనలో పరారైన మరో ఇద్దరు స్మగ్లర్ల కోసం శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో సీఐ నాగార్జునరెడ్డి సిబ్బందితో కలిసి ముమ్మరంగా గాలింపు చేపట్టారు. బుధవారం శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద సంచరిస్తున్న సురేష్‌ను రిమాండ్‌కు తలించారు. మరో స్మగ్లర్ కోసం గాలింపు కొనసాగిస్తున్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



విద్యార్థులతో నిర్వాహకులు

ఏర్పేడు, మే 28(ఆంధ్రజ్యోతి): మండలం లోని నాగంపల్లి సమీపంలో ఉన్న ఎస్‌వోఎస్ సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కెరీర్ గైడెన్స్ శిక్షణ కార్యక్రమం జరిగింది. 7నుంచి 19వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించబడింది. ఏర్పే డు, వెంటకగిరి, శ్రీకాళహస్తి మండలాల నుంచి సుమారు వంద మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ శిక్షణలో జేసీఐ ఇండియా ఇంటర్నేషనల్ కమిషనర్, కెరీర్ మార్గదర్శకుడు డాక్టర్ ఎస్‌టీ హర్షవర్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన 10వ తరగతి తరువాత విద్యావకాశాలు, పాఠశాలలు, వృత్తి కోర్సులు, స్కాలర్‌షిప్, వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలను వివరించారు. అలాగే వ్యక్తిగత నైపుణ్యాలను గుర్తించి సరైన కెరీర్‌ను ఎంచుకోవాలని సూచించారు. ఎస్‌వోఎస్ బాలల గ్రామం లోకేషన్ ఇన్‌ఛార్జి సత్యనారాయణ, కోవర్కర్ మునిరత్నం, అనిమేటర్లు పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడి సేవలో అడిషనల్ డిప్యూటీ కంప్ట్రోలర్



ఏర్పేడు, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లంలో కొలువై ఉన్న పరశురామేశ్వరుడిని బుధవారం న్యూఢిల్లీకి చెందిన అడిషనల్ డిప్యూటీ కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ రేనాప్రకాష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఏర్పేడు తహసీల్దారు భార్గవి, ప్రధాన అర్చకుడు వంశీకృష్ణ శర్మ, మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం

పుత్తూరు అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి): మానసిక, శారీరక ఆరోగ్యం యోగాతోనే సాధ్యమని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. ఎస్‌ఆర్‌ఎస్ డిగ్రీ కళాశాల, మున్సిపల్ కార్యాలయం, హిమజ డిగ్రీ కళాశాల, కల్యాణపురం సమావేశ మందిరంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ నెల 27వ తేదీ నుంచి 31 వరకు ఈ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బస్సు



పుత్తూరు అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి - చెన్నై జాతీయ రహదారిలో ట్రాక్టర్‌ను వెనుక నుంచి ప్రైవేటు బస్సు ఢీకొంది. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో పుత్తూరు సమీపంలోని ఫ్రైడేన్ హోటల్ వద్ద ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ట్రాక్టర్ ట్రాలీ బోల్తా కొట్టింది. ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బస్సు ముందు భాగం దెబ్బతింది. బస్సులో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

ఎన్టీఆర్ క్రమశిక్షణను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి

పుత్తూరు, మే 28(ఆంధ్రజ్యోతి): స్వర్గీయ ఎన్టీఆర్ క్రమశిక్షణను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పుత్తూరు డిగ్రీ కళాశాలను ఆయన ప్రారంభించారన్నారు. మండల వ్యవస్థ, రూ.2కే కిలో బియ్యం, మునసబు, కరణం వ్యవస్థ రద్దు, మహిళలకు ఆస్తిహక్కు వంటి తిరుగులేని పథకాలుగా చరిత్రలో నిలిచిపోయాయన్నారు. అధ్యాపకులు వీరయ్య, దేవకి, నరసింహులు, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి




వడమాలపేట టీడీపీ కార్యాలయం, పుత్తూరు అన్న క్యాంటీన్ వద్ద ఎన్టీఆర్ జయంతి వేడుకలు

వడమాలపేట, మే 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు దాముయాదవ్, ధనంజయులు నాయుడు, శివరాయల్, లక్ష్మీప్రసన్న, వెంకటయ్య, పెద్దబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు అర్బన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్న క్యాంటీన్, అంబేడ్కర్ కూడలి, పురపాలక సంఘం కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అన్న క్యాంటీన్ వద్ద పార్టీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. తెలుగుజాతీ విక్కీరాయల్, నాగరాజు, బాలాజీయాదవ్, భరత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే అంబేడ్కర్ సర్కిల్ వద్ద మాజీ ఎంపీపీ డీఎన్ ఎలుమలై, నాయకులు బాబునాయుడు, కరుణాకర్, సొరకాయలు రాజు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మంజునాథ్ గౌడ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రేషన్ డీలర్లు రెన్యువల్ చేసుకోండి

వడమాలపేట,మే 28(ఆంధ్రజ్యోతి):మండలంలోని రేషన్ డీలర్లు రికార్డులు అందజేసి తప్పనిసరిగా రెన్యూవల్ చేసుకోవాలని తహసీల్దార్ జరీనా చెప్పారు. బుధవారం పలు రేషన్ దుకాణాల్లో కీ రిజిస్టర్, ఆయా పరిధిలో రేషన్ కార్డులకు నిత్యావసర సరుకులు అందడంపై విచారించి, సంబంధి రిజిస్టర్లను పరిశీలించారు. మండలంలోని 35 చౌకదుకాణాల తీరు తెన్నులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్స్ డీటీ కృష్ణమ్మ, వీఆర్వో చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు(ఆంధ్రజ్యోతి): చౌక దుకాణ డీలర్ షాపుల ఆధ్వర్యంలోనే జూన్ నుంచి నిత్యావసర వస్తువుల పంపిణీ జరగాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేసేందుకు రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. మండలంలోని 42 చౌక దుకాణాలను తనిఖీ చేస్తున్నామని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. జూన్ 1న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు.

రీసర్వేతో భూసమస్యల పరిష్కారం

పుత్తూరు టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): భూ రీసర్వేతో హద్దులు, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కారించుకోవచ్చని డీటీ అశోక్ రెడ్డి తెలిపారు. బుధవారం తడుకు, శిరుగురాజపాలెంలో రీసర్వే చేశారు. సర్వేయర్ నవీన్, వీఆర్‌వో ఫిరోజ్ ఖాన్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు.

రైలు కింద పడి పది మేకల మృతి



పుత్తూరు, మే 28(ఆంధ్రజ్యోతి): పుత్తూరు రైల్వే స్టేషన్‌కు సమీపంలోని దిగువ కనకంపాళెం వద్ద బుధవారం సాయంత్రం చెన్నైకు వెళ్తున్న రైలు కింద పడి పది మేకలు మృత్యువాత పడ్డాయి. ఆ మేకల యజమాని దళితవాడ చిన్నయ్య తెలిపిన వివరాలు... మేతకు వెళ్లి తిరిగి వస్తూ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని చనిపోయాయని తెలిపారు. ఈ విషయమై రైల్వే పోలీసు అధికారులను విచారించగా తమ దృష్టికి ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

సీఐడీకి గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ రైటర్

రేణిగుంట, మే 28, (ఆంధ్రజ్యోతి): గాజులమండ్యం పోలీస్ స్టేషన్ రైటర్ సారథి సిఐడికి బదిలీ అయ్యారు. మూడేళ్ల క్రితం ఇక్కడికి వచ్చిన ఆయన హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ విజయవాడ సీఐడీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు అందాయి. ఈ సందర్భంగా ఆయన్ను పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సన్మానించారు. సీఐ మంజునాథ్ రెడ్డి, ఎస్‌ఐ సుధాకర్, రేణిగుంట, ఏర్పేడు పీఐలు జయచంద్ర, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోండి

శ్రీకాళహస్తి, మే 28(ఆంధ్రజ్యోతి): యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో బాలయ్య చెప్పారు. యోగాంధ్రలో భాగంగా బుధవారం పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్న పాఠశాలలో యోగా శిక్షణ నిర్వహించారు. ఉదయం 6 నుంచి 8గంటల వరకు పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు, మున్సిపల్ కార్యాలయం, జడ్పీబాలికల ఉన్నత పాఠశాల, భాస్కరపేట పురపాలక సంఘ ఉన్నత పాఠశాల, బాబుఅగ్రహారం ఉన్నత పాఠశాలల్లో ఈ యోగా తరగతులు జరిగాయి. అదే విధంగా శ్రీకాళహస్తి మండలంలోని అక్కుర్తి, తొండమనాడు, వాంపల్లి, వాగవేడు పాఠశాలల్లో కూడా యోగా తరగతులు నిర్వహించారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): రోజు ఉదయాన్నే యోగా చేయాలని ఎంఈవో మునిసుబ్రమణ్యం తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, పల్లమాల ఉన్నత పాఠశాలల్లో యోగాపై అవగాహన కల్పించారు. కార్యదర్శులు సుబ్రమణ్యం, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలం లోని 9 సచివాలయాలను నాలుగు క్లస్టర్లుగా విభజించి యోగాపై శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో మహ్మద్‌రఫి తెలిపారు. పిచ్చా టూరు జడ్పీహైస్కూలు మైదానంలో స్థానికులతో కలసి అధికారులు యోగాసనాల్లో పాల్గొన్నారు. యోగా చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యంతతో జీవించవచ్చన్నారు.

గురుసాత్వికకు సన్మానం

శ్రీకాళహస్తి, మే 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జయరామరావువీధిలోని సరస్వతిబాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న జనమాల గురుసాత్విక ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో చిన్నారిని సత్కరించారు.

పారదర్శక ఓటర్ల జాబితాకు సహకరించాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 28 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాను పారదర్శకంగా తయారు చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం అవసరమని డీఆర్వో నరసింహులు అన్నారు. ఇదే అంశంపై కలెక్టరేట్‌లో బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఓటర్ల జాబితా తయారీలో వారి సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, డీటీ ఉషారాణి పాల్గొన్నారు.

మహానాడులో టీడీపీ నేతల సందడి





మహానాడులో సత్యవేడు, బీఎన్‌కండ్రిగ నాయకులు - మహానాడకు బయలుదేరిన పిచ్చాటూరు నాయకులు

సత్యవేడు, మే 28 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడులో సత్యవేడు టీడీపీ నేతల సందడి నెలకొంది. పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నేతలు భారీగా మహానాడుకు తరలివెళ్లారు. రెండో రోజు బుధవారం మహానాడు ప్రాంగణంలో సత్యవేడు టీడీపీ నేతలు పలువురు రాష్ట్ర, జిల్లా టీడీపీ నేతలను కలుసుకున్నారు. మహానాడుకు తరలి వెళ్లిన వారిలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పరమశివం, షణ్ముగం, ఎంఎంరవి, అరుళ్, ఆనందయ్య, ప్రభాకర్ రెడ్డి, చిట్టిరెడ్డి, శశిమోహన్, ధనేష్‌కుమార్, మధు తదితరులు ఉన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): కడప లో జరుగుతున్న మహానాడుకు బీఎన్ కండ్రిగ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఐదు బస్సులు, 10 కార్లలో మూడు వందలకు పైగా కార్యకర్తలు తరలినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు తెలిపారు. మహానాడులో పాల్గొన్న వారిలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సుధాకర్‌నాయుడు, నాయకులు రమేష్‌బాబు, చెంచురామనాయుడు, శ్రీనివాసులు, బద్రి, భూపయ్య ఉన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడుకి బుధవారం పిచ్చాటూరు మండలం నుంచి పెద్ద ఎత్తున యువకులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యువగళం పాదయాత్రలో లోకేశ్ చెప్పినట్లే 20 లక్షల ఉద్యోగాలు యువతకు కల్పిస్తారన్న భరోసా కలిగిందన్నారు. ఆరు పథకాలతో కార్యాచరణ రూపొందించిన మంత్రి లోకేశ్‌కి కృతజ్ఞులు చెప్పారు.

అగ్నిమాపక కేంద్రం వెనుక అధ్వాన పారిశుధ్యం



పూడి పోయిన కాలువపై పడ్డ చెట్ల కొమ్మలు

శ్రీకాళహస్తి, మే 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం వెనుక అధ్వాన పారిశుధ్య పరిస్థితులు నెలకొన్నాయి. నెలల తరబడి మురుగు స్తంభించి పోవడంతో ఈ ప్రాంతమంతా దుర్గంధంగా మారింది. పట్టణ నడిబొడ్డున ఈ ప్రాంతం ఉంది. అగ్నిమాపక కేంద్రం వెనుక పెద్దఎత్తున నివాస గృహాలున్నాయి. మురుగు తొలగించకపోవడంతో దోమల సమస్య వెంటాడుతోంది. గత యేడాది ఈ ప్రాంతంలో టైఫాయిడ్, డెంగ్యూ, చికున్‌గున్యా జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. పారిశుధ్య సిబ్బంది ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు వాపోతున్నారు బుధవారం విద్యుత్ శాఖ సిబ్బంది అగ్నిమాపకకేంద్రం వెనుక చెట్ల కొమ్మలను తొలగించారు. కొన్ని కొమ్మలు కాలువలో పడటంతో అలాగే వదిలిపెట్టారు. దీంతో కాలువలను శుభ్రం చేసి చెట్టకొమ్మలను తొలగించాలని స్థానికులు లబోదిబోమంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు తొలగించాల్సి ఉంది.

పల్లమాలలో పారిశుధ్య పనులు

బుచ్చినాయుడుకండ్రిగ, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లమాల లో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని మురుగు కాలువలు శుభ్రం చేసి, వీధుల్లో మురుగు తొలగించి బ్లీచింగ్ చల్లారు. సర్పంచ్ రమణమ్మ మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు వేసి ఇవ్వాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

రేణిగుంట, మే 28 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తనిఖీ చేశారు. బుధవారం ఉదయం కార్యాలయం చేరుకున్న జేసీ రేణిగుంట - నాయుడుపేట మధ్య ఆరు లేన్ల హైవేకు మల్లవరం వద్ద 33 సెంట ల్యాండ్ అక్విజిషన్ కోసం రికార్డులు పరిశీంచారు.

సత్యవేడు గంగ జాతరకు చాటింపు



సత్యవేడు, మే 28 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు గంగ జాతరకు బుధవారం చాటింపు వేశారు. పట్టణంలో ఏటా రెండు రోజుల పాటు జరిగే జాతరకు సత్యవేడు పరిసర ప్రాంతాలతో పాటు తమిళనాడు నుంచి వేలాదిమంది భక్తులు తరలివస్తారు. కాగా ఈ ఏడాది జూన్ 10, 11 తేదీల్లో రెండు రోజుల పాటు సత్యవేడు గంగ జాతరకు ఏర్పాట్లు చేస్తున్నారు. చాటింపు సందర్భంగా అమ్మవారు కొలువుదీరే గంగ మిట్ట వీధిలోని గంగమ్మ ఆలయం వద్ద చలువ పందిరి ఏర్పాటు చేసి అమ్మవారి కలశాన్ని ప్రతిష్ఠించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అంబళ్ళు పోశారు. అనంతరం ఆనవాయితీ ప్రకారం సదవాలమ్మ ఆలయం వద్ద సాయంత్రం మహిళలు పెద్ద ఎత్తున చేరుకుని పొంగళ్ళు పెట్టారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

రేణిగుంట, మే 28, (ఆంధ్రజ్యోతి) : డివైడర్‌ను ఢీకొని యువకుడు తీవ్ర గాయాలు పాలైన సంఘటన బుధవారం సాయంత్రం ఆర్ మల్లవరం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు ఆర్ మల్లవరం గ్రామానికి చెందిన యువకుడు ద్విచక్రవాహనంలో రేణిగుంటలో పని నిమిత్తం వస్తుండగా మార్గం మధ్యలో డివైడర్‌ను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలైంది. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అర్బన్ పోలీసులకు ఇప్పటి వరకు ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందలేదు.